క్లుప్తంగా

ఓటు హక్కుపై వినూత్న అవగాహన



ఈవీఎం నమూనా వద్ద అవగాహన కల్పిస్తున్న కార్పొరేషన్ అధికారులు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాలతో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహ కూడలిలో భారీ ఈవీఎం నమూనాలు ఏర్పాటు చేశారు. ఏఈఆర్వో, మునిసిపల్ కమిషనర్ అరుణ ఆదేశాలతో నమూనా ఏర్పాటు చేసిన అధికారులు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈవీఎంలో ఓటింగ్ విధానంపై ఈ నమూనా ఆధారంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈవీఎంలో ఓటు వేసిన సందర్భంలో ఎవరికి ఓటు వేశామో, వారి పేరు ఎదురుగా లైట్ వెలిగేలా ఏర్పాట్లు చేశారు. ఈవీఎం పనిచేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. కార్పొరేషన్ ఏసీపీ రామకృష్ణుడు, స్వీప్ ప్రచార విభాగం అధికారులు పాల్గొన్నారు.

గుడిపాల తహసీల్దార్‌గా విజయలక్ష్మి



గుడిపాల: మండల తహసీల్దార్‌గా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా అనంతపురం జిల్లా రూరల్ మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గుడిపాలలో పనిచేస్తున్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ సిబ్బంది, ప్రజల సహకారంతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలియజేశారు. తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ కల్యాణి, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పూతలపట్టుకు శివరాముడు



పూతలపట్టు: మండల కేంద్రంలోని నూతన తహసీల్దార్‌గా శివరాముడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విజయభాస్కర్ చిత్తూరు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. శివరాముడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు.

తవణంపల్లెకు వెంకటేశ్వర్లు



తవణంపల్లె: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బుధవారం వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీడీఓగా పనిచేసిన అబ్దుల్ కలాం ఆజాద్ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ వెంకటేశ్వర్లను మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు హరిరెడ్డి, ఈజీఎస్ సిబ్బంది శాలువ కప్పి ఘనంగా స్వాగతం పలికారు.

పోర్టబుల్ మైక్‌సెట్ వితరణ



కొనాపల్లె ప్రాథమిక పాఠశాలకు మైక్‌సెట్ అందిస్తున్న దాతలు

యాదమరి: మండలంలోని కోనాపల్లె ప్రాథమిక పాఠశాలకు చిత్తూరులోని రాంనగర్‌కాలనీకి చెందిన దాతలు దేవిక, రమణి పోర్టబుల్ మైక్‌సెట్ వితరణగా అందించారు. బుధవారం మధ్యాహ్నం దాతలు పోర్టబుల్ మైక్‌సెట్‌ను ఎంఈఓ రుక్మిణీకి అందించారు. అనంతరం వారు పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. దాతలకు ఎంఈఓ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కుప్పం రూరల్: మండలంలోని పరసముద్రం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు గాను ఈ నెల 23వ తేదీలోపు ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ మల్లేశ్వరి కోరారు. విద్యార్థులు ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నెంబరు, ఫొటో, కుల ధృవీకరణ పత్రాలతో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ప్రవేశపరీక్ష మార్చి 10న ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు పనివేళల్లో 9959888586 ను సంప్రదించాలని కోరారు.

సంక్షేమ సారథికే మళ్లీ పట్టాభిషేకం

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసిన ఏకైక సీఎం జగన్
- పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్





వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు, వృద్ధురాలితో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: అర్హులందరికీ ఎలాంటి సిఫారసులు లేకుండా పథకాలను అందిస్తున్న సంక్షేమ సారథి జగనన్నకే మళ్లీ పట్టాభిషేకం కడదామని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని కరిడివారిపల్లె, దళితవాడ గ్రామాల్లో బుధవారం పార్టీ నాయకులతో కలసి డాక్టర్ సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న పథకాలను గురించి తెలియజేశారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ, జగనన్న నవరత్న పథకాలతో అర్హులకు సంక్షేమ పథకాలను అందించారన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం అంశాలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మళ్లీ గొప్ప పాలన కావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు.

అప్పట్లో టీడీపీ వాళ్లకే పథకాలు

తెలుగుదేశం పాలనలో ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని సునీల్‌కుమార్ అన్నారు. చంద్రబాబు పాలనలో ప్రభుత్వ పథకాలు జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకే పరిమితమయ్యాయన్నారు. చంద్రబాబు తప్పుడు హామీలతో బడుగు బలహీన వర్గాలను, రైతులు, మహిళలను, యువకులను మోసగించిన విషయాన్ని గుర్తుచేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల చెంతకు తీసుకువచ్చారని వివరించారు. ప్రజారోగ్యానికి భరోసా కల్పించి గ్రామాల ముంగిటకే కార్పొరేట్ వైద్య సేవలను తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు, వ్యవసాయ పరికరాలు పట్టణాలకు వెళ్లే పనిలేకుండా అందిస్తున్నట్లు తెలిపారు.

సూర్యోదయం కంటే ముందే పింఛన్

సూర్యుడు ఉదయించక ముందే గ్రామ వలంటీర్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతు అక్కచెల్లెమ్మలకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి డీబీటీ ద్వారా నగదు అర్హులకు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పాలకూరు రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, స్థానిక సర్పంచ్ ఆశ, ఎంపీటీసీ ఉషశ్రీ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు శరత్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఈడిగ, వడ్డెర కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు ఎల్లప్ప, మొగిలీశ్వర్, ఏఎంసీ, సింగిల్ విండో అధ్యక్షులు నారే సోమశేఖర్, దత్తాత్రేయరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతీశ్వరి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, తవణంపల్లె మండల కన్వీనర్ హరిరెడ్డి, ఎన్‌ఆర్‌ఐ భరత్‌రెడ్డి, మండల మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్ కన్వీనర్లు హిదాయత్, నాగరాజ, దొరస్వామి, మండల యూత్ అధ్యక్షుడు జగదీష్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు రేపు

చిత్తూరు రూరల్: కట్టమంచి రామలింగారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 10న ఆ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీధర్ తెలిపారు. వ్యాసరచన పోటీల్లో 6,7 తరగతులకు కట్టమంచి రామలింగారెడ్డి బాల్యం-విద్యాభ్యాసం, 8,9,10 తరగతులకు పునఃవినియోగం ఆవశ్యకత, వక్తృత్వ పోటీల్లో 6,7 తరగతులకు పరిసరాల శుభ్రత -మన పాత్ర, 8,9,10 తరగతులకు విద్యారంగానికి కట్టమంచి రామలింగారెడ్డి చేసిన సేవలు అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. చిత్రలేఖనంలో 6,7 తరగతులకు సీఆర్‌రెడ్డి చిత్రపటం, 8,9,10 తరగతులకు నీరు-సంరక్షణపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు గురువారం సాయంత్రంలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు పోటీలు, ఈనెల 24వతేదీ జరిగే వర్ధంతి సభలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆహ్వానం

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈనెల 15న చిత్తూరులో రీజనల్ జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డిని జెడ్పీ కార్యాలయంలో కలిసి స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఆహ్వానించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆర్ఎస్‌డీఓ శ్యాంమోహన్, డీఎస్‌డీఓ గుణశేఖర్‌రెడ్డి, డీఎఓ మురళీకృష్ణ, ఏడీఎస్‌డీఓ ఏకాంబరం, డీపీఓ చైతన్య తదితరులు ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు అందించండి



చిత్తూరు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేయర్, డీఎంహెచ్‌వో, కమిషనర్



పూతలపట్టు: ఎంపీడీఓకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్న వైద్యాధికారులు

చిత్తూరు అర్బన్: పిల్లలకు ఆరోగ్యం కోసం ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా తినిపించాలని నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ అరుణ చెప్పారు. ఫిబ్రవరి 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు ఈ మాత్రలు తినిపించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. చిత్తూరు మునిసిపల్ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మేయర్, కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తదితరులు ఆవిష్కరించారు. కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు అవసరమైన మాత్రలను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. మేయర్, అధికారులు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం భోజనం తర్వాత నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రను నమిలి మింగించాలన్నారు. 1 నుంచి 2 వయస్సు మధ్య ఉన్న పిల్లలకు అరమాత్ర, 2 నుంచి 19 ఏళ్ల మధ్య పిల్లలకు 400గ్రా. మాత్ర నమిలి మింగించాలన్నారు. మధ్యాహ్నం భోజనం తిన్న తర్వాతే మాత్రను నమిలి మింగించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీకాంత్, సహదేవన్, సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీ

పూతలపట్టు: ప్రభుత్వం పేదల పిల్లల కోసం అందించే ఆల్బెండజోల్ మాత్రలను తప్పక వాడాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జిల్లా నుంచి వచ్చిన ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీడీఓకి అందజేశారు. వారు మండల ఎంఈఓకి అందజేసి, పాఠశాలలోని విద్యార్థులకు పంపిణీ చేయాలని తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పిల్లలను పట్టి పీడించే అనారోగ్య సమస్యల్లో నులిపురుగులు ప్రధానమైనవని చెప్పారు. వీటి వల్ల పిల్లలకు రక్తహీనత, పోషకలోపం, వంటి పలు సమస్యలు వస్తా యని పేర్కొన్నారు. వాటి నుంచి పిల్లలను రక్షించాలంటే ఆల్బెండజోల్ మాత్రలను తప్పకుండా వాడాలని సూచించారు. మండలంలోని విద్యార్థులకు తప్పకుండా మాత్రలను పంపిణీ చేసి, తినిపించాలని స్పష్టం చేశారు.

విజయవంతం చేయాలి

తవణంపల్లె: నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక హై స్కూల్లో నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను పాఠశాలకు అందజేశారు. ప్రతి ఒక్క విద్యార్థికి భోజనం తిన్న తర్వాత మింగించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రియాంక, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గణిత ప్రజ్ఞాధారణపై పట్టుసాధించాలి



గణిత అవధాని అరుణ్‌శివప్రసాద్, విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: విద్యార్థులు గణిత ప్రజ్ఞాధారణపై పట్టు సాధించాలని మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్‌ఫోరం, జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 'గణితప్రజ్ఞాధారణ' కార్యక్రమాన్ని చేపట్టారు. గణిత అవధాని, ఏపీ మ్యాథ్స్‌ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ్‌శివప్రసాద్ శిష్య బృందం లహరి, హేమ, రేవతి, పునీత్‌సాయిచే గణితప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రేక్షకులు చెప్పిన 100 రెండు అంకెల సంఖ్యలను బోర్డుపై రాశారు. విద్యార్థులు వీటిని ఒక్కసారిగా విని మొదటి నుంచి చివరకు, చివరి నుంచి మొదటికి చెప్పడమే కాకుండా ఆ సంఖ్యల స్థానాలను తెలియజేశారు. 200 అంకెల సంఖ్యలను 5తో గుణించి లబ్ధాన్ని విద్యార్థులతో చెప్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రజ్ఞాధారణ అబ్బురపరచింది. ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గణితంపై ఇంతగా పట్టు సాధించడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. భారతదేశంలో తొలిసారి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు గణిత ప్రజ్ఞాధారణతో ఇన్ని సంఖ్యలు చెప్పడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఎంఈఓ-2 రమేష్‌బాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులచే ఇలాంటి గణితానికి సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించడం గర్వకారణమన్నారు. అనంతరం గణితావధాని అరుణ్‌శివప్రసాద్‌తో పాటు వారి శిష్య బృందాన్ని జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బేరీనాథ్, గణిత ఉపాధ్యాయులు శివరామారావు, పద్మనాభం, పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

216 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ శ్రీధర్

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 216 మందికి ఉద్యోగాలు లభించాయని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. ఆ కళాశాలలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో 216 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.2,25,000 నుంచి రూ.3,20,000 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

క్రమశిక్షణ ముఖ్యం



మాట్లాడుతున్న చైర్మన్ తేజోమూర్తి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థుల ఆశయ సాధనకు క్రమశిక్షణ ముఖ్యమని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. నగరంలోని కల్యాణ మండపంలో బుధవారం ఇంటర్మీడియట్ విద్యార్థుల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి మానసికంగా ఎదగడానికి ఆశయాలను సాధించేందుకు పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. వ్యక్తిత్వ వికాసం ఒక మనిషిని అనూహ్యమైన విజయాల వైపు పయనించేలా చేస్తుందన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ఈడీ శైలజా, ప్రిన్సిపల్ జీవరత్నం పాల్గొన్నారు.

భవిష్యనిధి బదిలీ చేయకుంటే బ్యాంకుపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో 310 మంది ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్ (భవిష్యనిధి) నగదు వెంటనే మరో బ్యాంకుకు బదిలీ చేయాల్సిందేనని కమిషనర్ అరుణ ఆదేశించారు. ఉద్యోగుల జీపీఎఫ్ నగదును ఏడాదిగా యాక్సిస్ బ్యాంకులోనే ఉంచుకుంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై 'సాక్షి' దినపత్రికలో బుధవారం 'బదిలీకాని భవిష్యనిధి' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ స్పందిస్తూ యాక్సిస్ బ్యాంకు నుంచి ఉద్యోగులకు రావాల్సిన రూ.కోటికి పైగా నిధులను రెండు రోజుల్లో తెప్పించాలన్నారు. దీనికి వడ్డీ సైతం వసూలు చేసి, ఉద్యోగుల పేరిట కొత్తగా ఓపెన్ చేసిన ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. లేనిపక్షంలో బ్యాంకు నిర్వాహకులపై ఆర్‌బీఐ, సెబీకి రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎస్‌ఐగా మల్లికార్జున్



బంగారుపాళెం: స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టరు(ఎస్‌ఐ)గా మల్లికార్జున్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రామ్‌భూపాల్(ప్రస్తుతం సీఐ)పూతలపట్టుకు పదోన్నతిపై వెళ్లారు. చిత్తూరు-1టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున్ బంగారుపాళెం ఎస్‌ఐగా నియమితులయ్యారు.

నగర వనం.. ప్రకృతి సోయగం

- నగర సమీపంలోని 50 హెక్టార్లలో అలరిస్తున్న పార్కు
- మొత్తం నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు
- ఆహ్లాదాన్ని పంచే అందాలు
- తుదిదశకు చేరుకున్న పనులు



నగరంలోని పెనుమూరు క్రాస్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న నగర వనం ప్రవేశ ద్వారం

చిత్తూరు కార్పొరేషన్: పచ్చదనంతో కనువిందు చేసే దృశ్యాలు.. ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరడం ఓ చక్కటి అనుభూతి, మానసిక ప్రశాంతతను ఇస్తుంది. నేడు ఉరుకులు, పరుగులు పెడుతూ, నిత్యం ఒత్తిడి జీవితాన్ని గడిపే ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం నగరవనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. చిత్తూరు నగరంలో పెనుమూరు క్రాస్ సమీపంలో అటవీ ప్లాంటేషన్లో నగరవనాన్ని తీర్చిదిద్దుతున్నారు. మరో నెల రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానున్న నగరవనంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నగర ప్రజలు రోజువారీ ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు ఏకైక మార్గం సినిమాలుగా చెబుతారు. అయితే చాలా మంది సినిమాలపై ఆసక్తి చూపడం లేదు. వారు ఎక్కడో దూరంగా ఉన్న ప్రాంతాలకు సెలవు రోజుల్లో కుటుంబసభ్యులతో వెళ్లి గడిపి వస్తున్నారు. నగరానికి సమీపంలోనే వినోదం, విజ్ఞానం, ఆహ్లాదాన్ని మేళవించి ప్రజలకు అందించడమే చేయడమే లక్ష్యంగా నగర వనం నిర్మాణం చేపడుతోంది. ఇప్పటికే పనులు తుదిదశకు చేరుకున్నాయి.

రూ.2 కోట్లతో నగరవనం

నగర పరిధిలోని పెనుమూరు క్రాస్ సమీపంలో 50 హెక్టార్ల అటవీ ప్రాంతంలో రూ.2 కోట్ల నిధులతో నగరవనం రూపుదిద్దుకుంటోంది. అటవీ అందాలు కనువిందు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ప్రజలు రోజంతా ప్రకృతి ఒడిలో పచ్చదనం తోడుగా ఉల్లాసంగా, ఉత్సాహంగా, సరదాగా గడిపేలా నగరవనాన్ని తీర్చిదిద్దుతున్నారు. పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు ఉయ్యాలలు, రంగుల రాట్నం, జారుడు బల్లలు తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌లు, వన్యప్రాణుల విశిష్టతను వివరించే విజ్ఞాన కేంద్రాలు, ఆయుర్వేద వైద్యానికి ఉపయోగించే మొక్కలు, చెట్లు, రాశివనం, నగరవనంలో కనువిందు చేయనున్నాయి. వివిధ రకాల పక్షుల బొమ్మలు, వన్యప్రాణుల చిత్రాలను సిద్ధం చేస్తున్నారు. సందర్శకుల కోసం పుట్టగొడుగుల ఆకారంలో ఉండే పకోడి, స్నాక్స్, టిఫిన్ చేసేందుకు క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం ఆటవస్తువులు అందుబాటులో ఉంచనున్నారు.

> **మార్చిలో అందుబాటులోకి**
>
> 
>
> చిత్తూరులోని నగరవనం మార్చిలోకి అందుబాటులోకి తీసుకురావడానికి పనులు జరుగుతున్నాయి. ప్రజలకు ఆహ్లాదం, వినోదం, విజ్ఞానం పంచేందుకు ఈ నగరవనం ఎంతో దోహదపడుతుంది. పనులు శరవేగంగా సాగుతోంది. కుటుంబసభ్యులతో ప్రజలు ఆహ్లాదంగా గడపడానికి ఈ ప్రాంతం వేదికగా మారనుంది.
>
> – చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ

నగర వనంలోకి నామమాత్రపు ఫీజుతో ప్రవేశం కల్పించనున్నారు. అక్కడ అందాలన్నీ వీక్షించడమే కాకండా, చెట్ల ప్రాధాన్యత, మానవ జీవనానికి పర్యావరణ పరిరక్షణకు ఎలా దోహదపడుతున్నాయో వివరించే ఏర్పాట్లు చేస్తున్నారు.



వాకింగ్ ట్రాక్ పక్క మొక్కలు నాటుతున్న సిబ్బంది



వనంలో ఏర్పాటు చేసిన ఉయ్యాల



పిల్లలు ఆడుకునే జారుడుబల్ల

కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి



చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి బుధవారం కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. శాంతి భద్రతల విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని కలెక్టర్ డీఎస్పీకి సూచించారు.

గ్రామీణుల ఇంటి వద్దకే వైద్యం





తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రియాంక, గుడిపాల: వైద్య శిబిరంలో డాక్టర్ అనూష

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు సౌకర్యంగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని దిగువమాఘంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు సలహాలిచ్చారు. అరగొండలో డాక్టర్ వినయ్‌కుమార్ గర్భవతులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నారగల్లులో..

గుడిపాల: మండలంలోని నారగల్లు గ్రామంలో డాక్టర్ అనూష 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మంచానికి గురైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్యం చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుమతి, కవిత, హైమావతి, గీత, తమార్లై పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

ఐరాల: ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలు ప్రభుత్వం అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేసి, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలే, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పథకాలపై ప్రచార రథం



గ్రామాల్లో ప్రచార రథాన్ని తిలకిస్తున్న ప్రజలు

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలపై ప్రచార రథం ఏర్పాటు చేశారు. చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని రామభద్రాపురం పంచాయతీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను తెలియజేస్తూ గ్రామాల్లో ప్రచార రథం సంచరిస్తోంది. దీంతోపాటు విజయానందరెడ్డి చిత్తూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రచార రథంపై అమర్చిన టీవీల ద్వారా ప్రజలకు తెలియజేశారు.